రహదారి, వంతెన సమస్యలపై ఆందోళనలు


రోడ్డు కోసం గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న గలగొండ గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ గలగొండ, ఏనుగుగొంది గ్రామాల వరకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం స్థానిక గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీసా మండల కమిటీ అధ్యక్షుడు లకే రామకృష్ణ, గ్రామస్తులు తెలిపారు. సొలభం జంక్షన్ నుంచి పొర్లుతోగు, గలకొండ, ఏనుగుగొంది వరకు 2017లో బీటీ రోడ్డు మంజూరైందని పొర్లుతోగు గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టి అనివార్య కారణాలతో వదిలి పెట్టటం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో గర్భిణీలు, అత్యవసర సమయాల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.ఈ మార్గంలో గెడ్డ వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో అత్యవసర సమయాల్లో అర చేతిలో ప్రాణాలు పెట్టుకొని గెడ్డ దాటాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షా కాలంలో వీధుల్లో రాకపోకలు సాగించటానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండలంలోని గలగొండ, ఏనుగుగొంది బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి రోడ్డు రవాణా సదుపాయాలు కల్పించేందుకు, అలాగే గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుతో పనులు చేపట్టానికి ప్రభుత్వం, అధికార్లు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

మత్స్యగెడ్డపై వంతెన కోసం...

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డ ఒడ్డున గిరిజన సంఘం నేతలు వంతెన నిర్మించాలని వినూత్న రీతిలో ఆదివారం నిరసన చేశారు.ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డపై రోజు 12 గ్రామాల గిరిజనులు నాటు పడవలపై దాటుతున్నారని, నాటు పడవల ప్రమాదాల వల్ల అనేకమంది మృతి చెందారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి, కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని, గిరిజన మత్స్యకారులకు బోట్లు, వలలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నేతలు శ్రీను, గాసిరాం దొర, భీమరాజు పాల్గొన్నారు.


మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

రోడ్డు పనులు ప్రారంభం


రాజవొమ్మంగి - అప్పలరాజుపేట మధ్య ప్రారంభమైన రోడ్డు పనులు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట, అమ్మిరేకుల, కిమ్మిలిగెడ్డ వెళ్లే రహదారి నిర్మాణ పనులు ఆదివారం పునఃప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రాజవొమ్మంగి - అప్పలరాజుపేట రహదారి పనులు ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయాయి. కాగా ఈ రోడ్డుపనులను ఇటీవల ప్రారంభించి, కొంతమేర చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఈ రహదారిపై ప్రయాణానికి ఇబ్బందులు పడేవారు.దీనిపై సాక్షిలో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు పనులు తిరిగి ప్రారంభించారు.దీంతో లోతట్టు గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులను త్వరితగతిన పూర్తి చేసి మా గ్రామాలకు రహదారి రవాణా కష్టాలు తీర్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

లంబసింగికి తగ్గిన పర్యాటకులు


చెరువులవేనం వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు

చింతపల్లి: ఆంధ్రా–కాశ్మీరు లంబసింగికి పర్యాటకుల సంఖ్య తగ్గింది. దీపావళి పండగ కావడంతో పర్యాటకుల సంఖ్య తగ్గినట్టు స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం అంతంతమాత్రంగానే పర్యాటకులు వచ్చారు. లంబసింగికి సమీపంలో గల చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకించి పర్యాటకులు సెల్‌ఫోన్‌లో ఫోటోలను తీసుకుంటూ సందడి చేశారు. తాజంగి జలాశయం వద్ద పర్యాటకులు ఎంజాయ్ చేశారు.

వినాయకుని ఆలయంలో చోరీ

- హుండీ పగులగొట్టిన దుండగులు


పగలగొట్టి ఉన్న హుండీ

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం వినాయకుని ఆలయంలో శనివారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. సంఘటనపై స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. దుండగులు ఆలయం మొదటి గేటు తాళం పగులగొట్టి లోపలకు వచ్చి, అక్కడున్న హుండీని రాయితో పగులగొట్టారు. అందులో ఉన్న నగదును దొంగలించినట్టు తెలిసింది. ఈ ఆలయంలో ఇలా జరగడం ఇదే ప్రథమం. ఆలయంలో మాలధారులు రాత్రి తొమ్మిదిన్నర వరకు పూజలు చేస్తారు. దొంగల స్థానికులై ఉంటారన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అర్చకుడు కృష్ణ మాట్లాడుతూ హుండీలో నగదు రూ.2వేల వరకు ఉండే అవకాశం ఉందని, దీనిపై కమిటీ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి


మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- గిరిజనులకు అందుబాటులో వైద్యసేవలు
- ఏడీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తినాయక్


డి.కృష్ణమూర్తినాయక్, డీఎంహెచ్‌వో

సాక్షి, పాడేరు: మన్యంలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయి. వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని యంత్రాంగం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంది. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య బృందాలు ఎంతో శ్రమిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ డి.కృష్ణమూర్తినాయక్ 'సాక్షి'కి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ దోమల నివారణ మందును రెండు విడతలుగా మలేరియా పీడిత గ్రామాల్లో పిచికారి చేయడంతో మలేరియా, డెంగ్యూ జ్వరాల నివారణకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల పరిధిలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని,గిరిజనులకు సత్వరమే మెరుగైన వైద్యసేవలు లక్ష్యంగా వైద్యబృందాలు పనిచేస్తున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ డి. కృష్ణమూర్తినాయక్ 'సాక్షి'కి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆయన పలు సూచనలిచ్చారు.



- ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ప్రజలంతా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.
- దోమల వ్యాప్తితో మలేరియా, డెంగ్యూ జ్వరాలకు ప్రజలు గురయ్యే ప్రమాదం ఉంది. దీన్ని అరికట్టేందుకు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వాడుక నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- దోమతెరలను వినియోగించాలి.
- ప్రాథమిక వైద్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు.
- పరిశుభ్రమైన, బాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. నిల్వ ఆహారం తీసుకోకూడదు.
- నీటి కాలుష్యంతోను పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇందు కోసం కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలి.
- రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి.
- ప్రతి రోజు వ్యాయామం చేయాలి.
- ఎలాంటి జ్వర లక్షణాలు ఉన్న వెంటనే వైద్యసిబ్బందితో పాటు సబ్‌సెంటర్లు, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించి రక్తపరీక్షలు జరుపుకోవాలి.

కార్పొరేట్‌కు దీటుగా గిరిజన సంక్షేమ పాఠశాలలు

- అందుబాటులో మెరుగైన సౌకర్యాలు
- ఉత్తీర్ణత శాతం పెంపునకు ప్రత్యేక శ్రద్ధ
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన విద్యాలయాల్లో నాడు–నేడు ద్వారా మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది కూడా మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధుల మంజూరుకు చర్యలు చేపట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 206 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలున్నాయి. గిరిజన విద్యాలయాల్లో గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యకు గిరిజన సంక్షేమ అధికారుల పర్యవేక్షణలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తున్నారు. వార్డెన్‌లు, మేట్రిన్‌లు, డిప్యూటీ వార్డెన్‌లు, డిప్యూటి మెట్రిన్‌లు కూడా గిరిజన విద్యార్థిని, విద్యార్థుల సంరక్షణలో తమ సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు. అన్ని గిరిజన విద్యాలయాల్లో నాణ్యమైన విద్యా బోధనతో పాటు అన్ని సౌకర్యాలను గిరిజన విద్యార్థులకు అందుబాటులో ఉంచామని, వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు.


ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

ప్రణాళికబద్ధంగా ప్రత్యేక తరగతులు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రతి ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఎంతో శ్రమిస్తున్నారు. గిరిజన విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించే లక్ష్యంగా ఒకటో తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నామన్నారు. రోజూవారీ టైమ్‌టేబుల్ ప్రకారం ప్రణాళికబద్ధంగా అన్ని సబ్జెక్టులలో స్పెషల్ క్లాసులతో పాటు మాక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడడంతో పాటు బోధన కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గిరిజన విద్యార్థుల నాణ్యమైన చదువుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


జైపూర్ జంక్షన్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల